ప్రజాశక్తి

ఆదివారం 22 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

కొసరు కొసరు సాయం..

ఉక్కుపై ఏంటి అసలు వ్యూహం ?

◆ పది రోజులుగా ఢిల్లీ స్థాయి చర్చల్లో ఏం తేల్చారు ? ◆ తాజా పరిణామాలపై కార్మికుల్లో ఆందోళన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయమై తాజాగా ఢిల్లీలో పది రోజుల పాటు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల స్థాయిలో జరిగిన సమావేశాల తర్వాత కొసరు కొసరుగా రెండు రోజుల క్రితం 'ఉక్కు'కు రూ.500 కోట్లు సాయం అందిన విషయంపైనా, అదే సమయంలో ఇక్కడి ఉద్యోగులను వేరొకచోటుకు తరలించేయత్నాలపైనా విశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.

ప్లాంట్ ఆర్థిక భారాన్ని తగ్గించడానికి తక్షణ ఆర్థిక సాయం ఇచ్చామని ఓ వైపు కేంద్ర పెద్దలు చెబుతూనే.. మరోవైపు 500 మంది కార్మికులను నాగర్‌నార్ (ఛత్తీస్‌గడ్) ఉక్కు కర్మాగారానికి తరలించే ఏర్పాట్లలో నిమగ్నం కావడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తున్న అంశం. ఈ నెల 23 నుంచి నాగర్‌నార్ ప్లాంట్‌కు కార్మికులను తీసుకునే ఇంటర్వ్యూలు కూడా జరుగనున్నాయి. మూడేళ్లుగా కొనసాగుతున్న కార్మిక, ప్రజా ఉద్యమంతో తీవ్ర ఇరకాటంలో పడ్డ ఢిల్లీ బిజెపి పెద్దలు కొంచెం అటు ఇటూ చేసి నిలబెడతాం అని చెబుతున్నారే తప్ప ప్రైవేటీకరణ, అమ్మకం నిర్ణయం నుంచి వెనక్కి వస్తున్నట్లు బాహాటంగాగానీ, అంతర్గత సమావేశాల్లోగానీ చెప్పడం లేదు. కొసరు కొసరు సాయం ఇస్తూ.. ఎంతో కొంత చేశామనిపించుకోడానికి మినహా సొంత గనులు కేటాయింపు, రా మెటీరియల్ సరఫరా, సెయిల్‌లో విలీనం వంటి కీలక అంశాల జోలికి మాత్రం వెళ్లడం లేదు. శనివారం సాయంత్రం ఉక్కు కార్మిక సంఘాలతో స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డి జరిపిన సమావేశంలోనూ పొడి పొడి చర్యలు గురించిన చర్చ జరిగిందే తప్ప 'అసలు వ్యూహం' నుంచి ప్లాంట్‌ను బయటపడేసే చర్చ ఎక్కడా జరగలేదు.

ప్రస్తుతం ప్లాంట్ ఉత్పత్తి ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌పై 5 వేల టన్నులకు పడిపోయింది. అక్టోబర్ నెలాఖరుకు రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను తెరిస్తే 14 వేల టన్నులకు వెళ్లాల్సి ఉంది. ఇటీవల రూ.500 కోట్లు సాయం ఉక్కుకు అందింది. దీంట్లో ఇప్పటికే జిఎస్‌టి కింద రూ.230 కోట్ల మేరకు కేంద్రం లాగేసిందని తెలుస్తోంది. మరోవైపు నాగర్‌నార్‌కు మొత్తంగా 1500 మందిని తీసుకెళ్లే యత్నాలు చాపకింద నీరులా జరుగుతున్నాయి. ఇంకొంత సొమ్ము కేంద్రం నుంచి వచ్చే అవకాశం ఉన్నా తెరచాటున అసలు వ్యూహం ప్రకారం ఉద్యోగుల కుదింపు నడవడం ఖాయంగా కనిపిస్తోంది. 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంగల వైజాగ్ స్టీల్‌ను ఇదే స్థానంలో ఉంచాలంటే మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లనూ నడపాల్సిందే. రూ.10 వేల కోట్లును మిగతా 2లో..

విశాఖలో గురజాడ విగ్రహం వద్ద గేయాలాపన చేస్తున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

మహనీయుడు.. గురజాడ

జయంతి వేడుకల్లో పలువురు వక్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆధునిక కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు మహనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. గురజాడ 162వ జయంతి సందర్భంగా శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న గురజాడ అప్పారావు విగ్రహానికి వారు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఐద్వా, పిఎన్ఎం, డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలాపన చేశారు. ఈ కార్యక్రమాల్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ గురజాడ అప్పారావు రాసిన దేశభక్తి గేయం ఎన్నటికీ సజీవమన్నారు. ఆ దేశభక్తి గేయాన్ని తూచా తప్పకుండా అందరూ పాటిస్తే దేశం చాలా అభివృద్ధి పథంలో ముందుకు పయనిస్తుందన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ - దేశమంటే మనుషులోయ్, సొంత లాభం కొంత మానుకొని.. పొరుగు వానికి తోడపడవోయ్, మతములన్నియు మాసి పోవును.. జ్ఞానం ఒకటే నిలిచి ఉండును అని పేర్కొన్న ఆయన రచన నిత్య స్ఫూర్తి అన్నారు. కన్యాశుల్కం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంఘ సంస్కరణ ఉద్యమాలను ఆయన చేపట్టారన్నారు. బాలికలకు విద్యా అవకాశాలు కల్పించాలని, ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని ఆనాడే ఎలుగెత్తి చాటారన్నారు. గురజాడ మిగతా 2లో..

జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌గా ప్రభాకర్‌రావు

▶ వార్త 2లో..

అధిక వర్షాలతో 95 శాతం వరినాట్లు

▶ వార్త 5లో..

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

▶ వార్త 5లో..

సన్యాసిరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

కార్మిక, శ్రామిక ప్రజల విలువైన మిత్రుడు సన్యాసిరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మిక, శ్రామిక ప్రజల విలువైన మిత్రుడు గంగిరెడ్డి సన్యాసిరావు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆయన మృతి యావత్తు కష్టజీవుల ఉద్యమానికి తీరనిలోటు అని తెలిపారు. ఈ నెల 14న మృతి చెందిన విప్లవ కవి, రచయిత, గాయకుడు గంగిరెడ్డి సన్యాసిరావు కుటుంబాన్ని విశాఖలోని పాతకర్ణవానిపాలెంలో వి.శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. సన్యాసిరావు మృతికిగల కారణాలను భార్య లక్ష్మి, కుమార్తె చైతన్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం తెలిపారు. సన్యాసిరావుతో తనకుగల వ్యక్తిగత పరిచయాన్ని, సంబంధాలను, జీవిత కాలంలో కష్టజీవుల ఉద్యమానికి మిగతా 2లో..

మౌనం వీడాలి..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అన్యాయం జరిగినప్పుడు మౌనంగానూ, తటస్థంగానూ వుండడమంటే అన్యాయానికి మద్దతు ఇస్తున్నట్లేనని దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా హక్కుల కోసం పోరాడిన నెల్సన్ మండేలా సమకాలికుడు డెస్మండ్ టుటు అంటారు. ఆ మౌనం వీడేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేసిన ప్రయత్నమే ఐదు రోజుల పాటు ఫార్మా, సెజ్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజల భద్రతకు జిల్లాలో సిపిఎం చేపట్టిన రక్షణ యాత్ర బైక్ ర్యాలీ. ప్రధాన రాజకీయ పార్టీలేవీ చేయనిపని సిపిఎం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర వ్యాపితంగా గతంలో ఉక్కు పరిరక్షణ యాత్ర చేపట్టింది. పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలతో కార్మికులు, ఉద్యోగులు చనిపోవడం, కాలుష్యం పెరిగి ప్రజలు ప్రాణాపాయ రోగాలపాలవడంతో ఒక శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు తాజాగా ఐదు రోజులు యాత్ర చేపట్టింది. కార్మికులు, ఉద్యోగులు కష్టాలు విన్నది. కాలుష్య ప్రభావిత గ్రామాల గోడు ఆలకించింది. పదవులు, అధికారం కోసం ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు యాత్రలు చేపడితే, కష్టాల్లోనున్న ప్రజల కోసం సిపిఎం యాత్రలు చేపడుతోందని అచ్యుతాపురంలో జరిగిన యాత్ర ముగింపు సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్న మాటలు ముమ్మాటికీ నిజం.

తమ ప్రభుత్వాల కాలంలో జరిగిన ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు పరిహారం ఇప్పించడాన్ని

సిగ్గులేకుండా ప్రధాన పార్టీలు గొప్పగా చెప్పుకుంటున్నాయి. వాస్తవానికి ఆ పరిహారం ఎగ్గొట్టాలని చూసినా సిఐటియు, సిపిఎం జోక్యంతో అనివార్యంగా ఇవ్వాల్సిన పరిస్థితులేర్పడిన సందర్భాలనేకం. జిల్లాలోని ఫార్మా, సెజ్‌లోని పలు పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో యాజమాన్య లోపాలు, తప్పులు బయట పడుతున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించని విషయాలు వెలుగు చూస్తున్నాయి. భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా కఠిన చర్యలు లేకపోవడంతో ప్రమాదాలను, కార్మికుల మరణాలను సాధారణ విషయంగానే యాజమాన్యాలు పరిగణిస్తున్నాయి. పరిహారం చెల్లిస్తే చాలన్నట్లు ప్రవర్తిస్తున్నాయి. ఈ ఆలోచన వారి బుర్రల్లో బలపడ్డం వెనుక కారణంలేకపోలేదు. పరిశ్రమల్లో భద్రత, కాలుష్య ప్రమాణాలను పరిశీలించడానికి పరిశ్రమల తనిఖీ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖలకు వున్న చట్టబద్ధమైన అధికారాలను మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు లేకుండా చేశాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమాధిపతుల తప్పులను సరిచేయించే ప్రభుత్వ వ్యవస్థలను బలహీనం చేశాయి. తమను నియంత్రించే శక్తులికలేవనుకొని పరిశ్రమ నిర్మాణంలో మొదలుకొని ఉత్పత్తి క్రమం వరకు పాటించాల్సిన ప్రమాణాలకు తిలోదకాలిస్తూ వస్తున్నాయి. పాత రియాక్టర్లు వినియోగించడం, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడం, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్మిక, శ్రామిక ప్రజల విలువైన మిత్రుడు సన్యాసిరావు

చేసిన సేవలను, ప్రజలు, పార్టీ పట్ల సన్యాసిరావు చూపిన నిబద్ధతను గుర్తు చేసుకున్నారు. సన్యాసిరావు భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం, పరీక్షల నిమిత్తం కెజిహెచ్ అనాటమీ విభాగానికి అందజేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఆయన వెంట పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఉన్నారు.

28న సంతాప సభ

సన్యాసిరావు సంతాప సభ ఈ నెల 28న ఉదయం 11 గంటలకు గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలోని పాతకర్ణవానిపాలెంలో జరుగుతుందని జగ్గునాయుడు తెలిపారు.

ఉక్కుపై ఏంటి అసలు వ్యూహం ?

కేంద్రం ఎయిడ్‌గా బ్యాంకులకు హామీ ఉండి ఇస్తేనే ప్లాంట్ నిర్వహణ ముందుకు వెళ్తుంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తేనే ప్లాంట్‌పై కేంద్రం నిర్ణయం మారే అవకాశముంది. ప్లాంట్‌కు.. కేంద్ర ప్రభుత్వానికి ఐరన్ ఓర్ కాంట్రాక్టు ఉన్నా దీన్ని కేంద్రం ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటోంది. వందేళ్లకు సరిపడా సొంత గనులు సెయిల్ వద్ద ఉన్నా విలీనానికి ససేమిరా అంటున్నారు.

అంతా సవ్యంగా సాగిన గతంలో...

2023-24 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌టి రూపంలో కేంద్రానికి రూ.1900 కోట్లును, రాష్ట్రానికి రూ.400 కోట్లును, ఆదాయపు పన్ను కింద రూ.300 కోట్లును ఇలా కస్టమ్స్ డ్యూటీ అన్నీ లెక్కేస్తే రూ.3450 కోట్లును స్టీల్‌ప్లాంట్ చెల్లించింది. 2002-2015 మధ్య కాలంలో 20 వేల మందికిపైగా కార్మికుల శ్రమశక్తితో రూ.15 వేల కోట్లు లాభాలను ప్లాంట్ సాధించింది. నేడు 12 వేల మందికి కుదించబడ్డ కార్మికులతో, ఉత్పత్తికి సరిపడా ముడిసరుకు అందని నేపథ్యంలో 4500 టన్నులకు ఉత్పత్తి పడిపోయింది.

స్టీల్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డితో భేటీకి సిద్ధమౌతున్న ఎంఎల్‌సి బొత్స

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో రోజురోజుకూ ఉత్పత్తి సామర్థ్యం పడిపోతున్న నేపథ్యంలో మాజీ మంత్రి, వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ స్టీల్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డితో చర్చించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని ఆయన శనివారం 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. రెండు మూడు రోజుల్లో అపాయింట్‌మెంట్ తీసుకుని జివిఎంసి మేయర్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, తమ పార్టీ ఎంఎల్‌సిలతో కలిసి ప్లాంట్ పరిస్థితిని పూర్తిగా తెలుసుకుంటానని వెల్లడించారు.

మౌనం వీడాలి..!

ప్రమాద హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం, తక్కువ జీతాలకు నైపుణ్యంలేని వలస కార్మికులతో ప్రమాద కరమైన ప్రదేశాల్లో పనిచేయించడం వంటి అనేక తప్పిదాలకు పాల్పడుతున్నాయి. ఈ పొరపాట్లను సరిచేసే ప్రయత్నం వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలు చేయలేదు.

ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రభుత్వాల అండతో పారిశ్రామికాధిపతులు పరిశ్రమల్లో భద్రతకు, కాలుష్య నియంత్రణకు నిధులు ఖర్చు చేయకుండా, సిఎం రిలీఫ్ ఫండ్ కింద కోట్ల రూపాయలు ఇవ్వడం, ప్రభుత్వ ప్రతిపాదిత పనులకు సిఎస్ఆర్ నిధులు ఇవ్వడానికి అలవాటుపడి శిక్షల నుంచి తప్పించుకోవడం పరిపాటిగా మారింది. ప్రమాదాలకు దారితీసే విధానాలను పునస్సమీక్షించి లోపాలను సరిచేసి కార్మికులు, ఉద్యోగులు, ప్రజల భద్రతకు ఇప్పటికైనా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇవ్వాలి.

23న బ్లాక్ డేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 23న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే నిర్వహించాలని పిలుపునిచ్చాయని, దానిలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు జగదాంబ జంక్షన్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మికుల పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి యాజమాన్యాలకు లాభాలు చేకూర్చాలని ప్రయత్నం చేస్తోందని, తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ రంగ ఆస్తులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఇప్పటికే దేశంలోని ఎయిర్ ఇండియా, విమానాశ్రయాలు, పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, బ్యాంకులు తదితర సంస్థలతోపాటు 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా ప్రైవేటీకరణ చేస్తోందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1300 రోజులు పైబడి కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నారన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేల తక్కువ లేకుండా చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రాణ రక్షణ కల్పించాలన్న డిమాండ్లతో ఈ నెల 23న బ్లాక్ డే జరుగుతుందన్నారు.

జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌గా ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ ఎపిసిఆర్‌డిఎ టౌన్ ప్లానింగ్ విభాగంలో అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.ప్రభాకర్‌రావును జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌గా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

మహనీయుడు.. గురజాడ

కళారూపాలతో ఆకట్టుకున్న చిన్నారులు

(మొదటి పేజీ తరువాయి..) 150 సంవత్సరాల క్రితమే సమాజాన్ని జాగృతం చేసి మేల్కొల్పారన్నారు. అయినప్పటికీ నేడు బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు వంటింటికే పరిమితం కావాలని, పిల్లల్నికనే యంత్రంగా ఉండాలని మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తీసుకొస్తోందని తెలిపారు. సనాతన ధర్మాన్ని పాటించాలని చెబుతోందన్నారు. నేటి సమాజానికి ఇవేవీ అవసరం లేదని, గురజాడ వారసులు అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, ఆర్.వరలక్ష్మి, ఒ.విజయ, ఎం.అన్నపూర్ణ, కె.సుజాత, ఎల్.పద్మ, జి.లక్ష్మి, జి.మణి, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఎన్‌వి.రమణ, మౌలాలి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గురజాడ సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162వ జయంతి ఉత్సవాలు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం కవిత ఓలా హోప్ డ్యాన్స్ పోటీలతో ప్రారంభమై మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు సాంస్కృతిక కళా ప్రదర్శనలు జరిగాయి. మహాకవి గురజాడ అభ్యుదయానికి సంబంధించిన 30 వరకు కళా ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు ప్రదర్శించబడ్డాయి. ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ హాజరయ్యారు. గురజాడ అడుగుజాడల్లో సమైక్యతపై కవిత వినిపించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ప్రముఖ రంగస్థల కళాకారులు, రచయిత, డైరెక్టర్ బాషాను గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు, సభ్యులు ఆర్ఎస్ఎస్.మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గురజాడ అప్పారావు 162వ జయంతి కార్యక్రమం అచ్యుతాపురం హైస్కూల్లో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఐద్వా నాయకులు ఆర్.లక్ష్మి, పాఠశాల హెచ్ఎం ప్రభావతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు అధ్యాపకురాలు రామలక్ష్మి అరుణోదయ, సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు, ఐద్వా నాయకులు సత్యవతి, అనూష, యశోద, నిరీష, అనిత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు, ఉపాధ్యాయులు

పోర్టు కార్మికుల సమస్యలపై

30న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 30న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని విశాఖ పోర్టు స్టీవ్‌డోర్, కాంట్రాక్ట్, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ పిలుపునిచ్చారు. పోర్టు నాన్ పర్మినెంట్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టులో నాన్ పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పోర్టు పూల్, సిహెచ్‌డి క్యాజువల్, ఆఫీస్టైడ్ క్యాజువల్స్, క్యాంటీన్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అంతవరకూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కాన్సెప్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

కాంట్రాక్టు లేబర్ రెగ్యులేషన్స్, అబాలిషన్ యాక్ట్ - 1970 ప్రకారం కాంట్రాక్టర్లు జీతాలు, ఇతర సౌకర్యాలు ఇవ్వకపోతే ప్రధాన యజమానులుగా ఉన్న పోర్టు ఛైర్మన్ బాధ్యత వహించాలన్నారు. విశాఖ స్టీల్, జివిఎంసి కాంట్రాక్ట్ కార్మికుల మాదిరే కాంట్రాక్టర్ మారినా కార్మికులను మార్చకూడదు అన్నారు. కాంట్రాక్టు, షోర్, స్టీవ్ డోర్ కార్మికులకు కూడా కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు.

పోర్ట్ ఆసుపత్రిని ప్రయివేటుకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్ట్ హాస్పిటల్‌ను ప్రైవేటుకు ఇవ్వవద్దని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని పోర్టులో సిహెచ్‌డి ఆర్‌డి యార్డ్‌లో ఎబిసి షిఫ్ట్‌లో గేటు సమావేశం నిర్వహించారు. డబ్ల్యూటిడబ్ల్యూఎఫ్ఐ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు సంవత్సరానికి రూ.170 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు కడుతోందన్నారు. అలాగే గత సంవత్సరం రూ.386 కోట్లు లాభాలతో ఉందని, రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని అన్నారు. వాటి నుంచి పోర్టు హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. కనీసం ఒక సంవత్సరం కట్టే పన్ను మినహాయిస్తే పోర్ట్ హాస్పిటల్‌ను మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చొచ్చునని తెలిపారు. పోర్టు కార్మికుల మీద ప్రేమ కాకుండా పోర్ట్ హాస్పిటల్ భూములు మింగేయాలన్న ఆలోచనతో ఈ దుర్మార్గానికి ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ గొప్పతనాన్ని వివరించారు. పోర్టు యాజమాన్య చర్యలను నిరసిస్తూ పోర్టు ఎ.ఒ.బి వద్ద ఈ నెల 24న మహా ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. గేట్ మీటింగులో సాంబమూర్తి, కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, సిహెచ్. త్రినాథ్, జె.సత్యనారాయణ, బి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

LOST / MISSING

I LOST FOLLOWING DOCUMENTS ON 27.08.2024 IN 48A. BUS AROUND BSNL OFFICE DABAGARDENS WHEN I AM TRAVELING TO COURT FROM SANGAM OFFICE TO JAGADAMBA JUNCTION.
1. AADHAAR CARD ORIGINAL
2. FAMILY CERTIFICATE
3. WILL OF MY FATHER IN LAW
4. COURT PAPERS
FOUNDERS MAY INFORM OR HANDOVER TO ME

NRMALA J
Cell: 9660571332

IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI
M.C.O.P NO: 354 OF 2023
Gandikota Venkatesh@G.Venkatesh ...**Petitioner**
-VS-
1) RR INFRA
2) TATA AIG General Insurance Co.Ltd., ...**Respondents**

To:-
RR INFRA Rep. by Pulimi Janardhanreddy, No. 3-3/1, Chinnayatha Palem, Duvvada Post [other] Gajuwaka, Visakhapatnam, Andhra Pradesh-530049 ... **For 1st Respondent**

PAPER PUBLICATION

Please take notice that the above M.C.O.P No. 354/2023 has been posted for your appearance on: 21-11-2024 before the Additional Subordinate Judge at Ponneri. Hence you are requested to appear before the Hon'ble court on: 21-11-2024 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.
Hg: 21-11-2024

G.LOGU, M.A., B.L.,
S.SUTHISH,
Counsel for Petitioner

PUBLIC NOTICE

Under instructions of My Client Smt. A.Seetha Kumari, W/o. A.B.C. Raghunadh, R/o. Flat No. 401A, Navya Nilife Apartments, Sheela Nagar, Kims Hospital Road, Visakhapatnam-530012. I give the following public notice, that my client has given general power of attorney to Hari Srinivasa Rao for sale of the lands ie. 1.Sy.No. 282/2 an extent of A/c 0.97 Cents 2. Sy.No. 1043/3 an extent of A/c 0.05 Cents 3. Sy.No. 282/1 an extent of A/c 0.60 cents dry lnd situated a Velchuri Panchayath and Village, Yelamanchili, Anakapalli District (Formely Visakhapatnam District) on 23-02-2011 My Client hereby inform to the General Public that G.P.A. was cancelled on 06-07-2024 and he is not my client's G.P.A. Holder from the above said date i.e. 06-07-2024 and he is not any right to sale the above said lands. So if any body do any transaction with him regarding the above said lands, my client is not responsible and the said transactions not binding on my client.

BODALA JAGANNADHA RAO
Advocate, 27/10, EWS Flats
Nehru Nagar,
Visakhapatnam-530002
Dt. 21-10-2024 Cell : 9441517057

సిహెచ్‌సిగా మార్చాలి

పిహెచ్‌సిపై మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం, భీమునిపట్నం మండలాల సర్వసభ్య సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు.

ఆనందపురం : ఆనందపురం మండల సమావేశం ఎంపిపి డాక్టర్ మజ్జి శారద ప్రియాంక అధ్యర్యాన నిర్వహించారు. మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున సిహెచ్‌సిగా మార్చాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సుమారు రోజుకు 200కుపైగా ఓపిలు ఉంటున్నాయని, ఇన్‌పేషెంట్లకు బెడ్ల చాలక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు డాక్టర్ గంగునాయుడు సభలో వివరించారు. తహశీల్దార్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, రీసర్వేలో జరిగిన సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. మండల పరిధిలో రోడ్ల సమస్యలపై జెడ్‌పిటిసి సభ్యులు వెంకటరావు మాట్లాడుతూ, 15 ఆర్థిక సంఘం నిధులు, జిల్లా పరిషత్ నిధులు వచ్చినా మండల అధికారులు సకాలంలో పనులను నిర్వర్తించడం లేదని మండల ఎఇ వెంకటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడపా లవరాజు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బోట్ల ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

సర్వసభ సమావేశంలో పలు సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఆనందపురం కళాశాల ఏర్పాటుకు కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకముందే ప్రహరీ నిర్మించాలని, పిహెచ్‌సినికమ్యూనిటీ హెల్త్ ఆరోగ్య కేంద్రంగా మార్చాలని, ఆనందపురంలో అన్న క్యాంటిన్, రైతుబజార్ ఏర్పాటుచేయాలని కోరుతూ తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు సమావేశంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆనందపురం శ్రమజీవుల కాలనీవాసులకు సామూహిక కార్యక్రమాలకు, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్‌కు ఐద్వా నాయకులు కె.నాగరాణి వినతి పత్రం అందజేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాలకు పహరీ నిర్మించాలని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బమ్మిడి ఉమ, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈగలవానిపాలెంలో పాఠశాల భవన నిర్మాణం పూర్తిచేయాలని, మంచినీటి ట్యాంకు మరమ్మత్తులు చేపట్టాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఎల్‌వి పాలెం ఎస్సీ కాలనీ నుంచి బోని రోడ్డు వరకు సిసి రోడ్డు మంజూరు తదితర సమస్యలపై సర్పంచ్ లోడగల రాజేశ్వరి వినతిపత్రం అందజేశారు.

బిల్లుల చెల్లింపు సర్వేకు ఆదేశాలు : హౌసింగ్ ఎఇ

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2016 -17, 2017-18, 2018 -19 సంవత్సరాల్లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలో మండలంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన 938 గృహాల లబ్దిదారులకు ఏ మేరకు బిల్లులు చెల్లించారు? పెండింగ్ బిల్లులు ఏ మేరకు ఉన్నవి? సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు మండల హౌసింగ్ ఎఇ ఎం హుస్సేన్ వెల్లడించారు. ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు, తాజా సమాచారాన్ని జోడించి సభలో చదివి వినిపించారు. ఇందులో భాగంగా హౌసింగ్ ఎఇ హుస్సేన్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో మండలంలో, విలీన ఐదు పంచాయతీల్లో 2085 ఇల్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 917 ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. స్లాబ్ స్థాయిలో 47, రూఫ్ స్థాయిలో 165 ఉన్నాయని, వీటిని ఈ నెల 25వ తేదీ లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే లబ్దిదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉందని వివరించారు.

ఇప్పటికే మండలంలో గుర్తించిన 160 మంది కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి తెలిపారు.

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామ సభల్లో 21 పనులు చేపట్టాలని, ఇందుకు రూ.5 కోట్ల 98 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు మండల ఎఇ కెఆర్.పట్నాయక్ సభలో తెలిపారు.

సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో మండల పరిషత్ యుపి పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు కోరారు. ఇందుకు ఎంఇఒ ఎం.శివరాణి బదులిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు ఉన్నాయని తెలిపారు. మండలంలో ఇప్పటికే పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఎంపిపి డివిఎస్‌ఎస్ఎన్.రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బి.బంగారునాయుడు, ఎండిఒ డాక్టర్ వి.జానకి, డిటి శ్రీనుబాబు, ఐఒసిఆర్‌డి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డివిఎస్‌ఎస్ఎన్ రాజు

సిఐని కలిసిన సిపిఎం బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం సిఐ చింత వాసునాయుడును శనివారం భీమిలి సిఐటియు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. లిక్కర్ గోడౌన్ కార్మికులు, ముఠా కార్మికుల సమస్యలను నాయకులు సిఐ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిఐకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నర్సింగరావు, ఐద్వా నాయకులు కె.నాగరాణి, మిద్దె మండల అధ్యక్షులు దొంతల రాము, ప్రమీల, ఎస్.నారాయణమ్మ పాల్గొన్నారు.

ఫార్మకో విజిలెన్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఫార్మసీ కళాశాలలో శనివారం ఫార్మకో విజిలెన్స్ వార్షికోత్సవం నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్యామల ఫార్మకో విజిలెన్స్ వార్షికోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఎయు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.చిత్ర మాట్లాడుతూ, క్లినికల్ ఫార్మసిస్ట్ అవశ్యకత, ఔషధ ప్రతి చర్యల నివారణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.ఉమాశంకర్, హెచ్ఒడిలు బి.మనోజ్‌కుమార్, ఎం.పావని పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25, 27 వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను జివిఎంసి సిబ్బంది తొలగించారు. 'పేరుకుపోయిన చెత్తతో అవస్థలు' శీర్షికన ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన కథనానికి జివిఎంసి అధికారులు స్పందించారు. రెండు చోట్ల ఉన్న చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు ఇబ్బందులు లేకుండా నడవగలుగుతున్నారు.

23 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఈ నెల 23 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆనందపురం మండల ఎస్‌జిఎఫ్ కో-ఆర్డినేటర్ వై.వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి ఆటలు పోటీలు ఆనందపురం హైస్కూల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్, అట్లాంటిక్ ఆటల పోటీలు నిర్వహించి మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 23న బాలురకు, 24, 25న బాలికలకు ఆటల పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాల, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. ఆటల పోటీలలో పాల్గొనే విద్యార్థులు పాఠశాల నుంచి అర్హత పత్రాన్ని తీసుకొని రావాలని పేర్కొన్నారు.

గోడ మట్టిని తొలగించిన అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం హైస్కూల్ సమీపంలో కూలిన గోడ మట్టిని శనివారం లోడగలవానిపాలెం పంచాయతీ అధికారులు తొలగించారు. హైస్కూల్ ప్రహరీ కూలి పైపులైను పగలడంతో 'పదిరోజులుగా తాగునీటికి ఇబ్బందులు' శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్పంచ్ లోడగల రాజేశ్వరిరమణ, గ్రామ కార్యదర్శి అనురాధ జెసిబిని పెట్టి మట్టిని తొలగించారు. పైప్ లైన్ల మరమ్మత్తులు చేపట్టారు. పనులు చేపట్టడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంచబోయిన శ్రీను, పైడిరాజు, గంగులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ దుర్గా గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ అధ్వర్యాన మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్యామల దీపిక, సత్యనారాయణరాజు హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 6000 మందికి అన్నదానం చేసినట్లు సారిపల్లి గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ ఛైర్మన్, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జివిఎంసి 26వ వార్డులో స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ చేతుల మీదుగా అన్నదానం చేశారు. 4000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు

అన్నదానం చేస్తున్న శ్యామల దీపిక, సత్యనారాయణరాజు

రక్త మూలకణ దానంపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ మజ్జ (మారో) దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్ సిటీలోనిహెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రిలో శనివారం రక్త మూలకణ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోగులు, ఇప్పటి వరకు బ్లడ్ స్టెమ్ సెల్స్ దానం చేసిన దాతలు పాల్గొన్నారు. ప్రాణాలను రక్షించడంలో రక్త మూలకణ దానం ప్రాముఖ్యత, అవగాహన పెంచడం, దాతలుగా నమోదు చేసుకునేలా వ్యక్తులను ప్రోత్సహించడం, తద్వారా ప్రాణాలను కాపాడడం, ఎముక మజ్జ రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు ఆశ కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అంతకుముందు రోగులకు బ్లడ్ స్టెమ్ సెల్స్ దానం చేసిన దాతలను ఆసుపత్రి యాజమాన్యం సత్కరించింది. ఆసుపత్రి సిఒఒ డాక్టర్ ఆదిత్య కౌర్ మాట్లాడుతూ, బ్లడ్‌స్టెమ్ సెల్స్ దాతల ద్వారా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారి జీవితాలలో గణనీయమైన మార్పును తీసుకురావచ్చన్నారు. ఇప్పటివరకు హెచ్‌సిజిలో 75 మందికి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రముఖ బోన్ ట్రాన్స్‌ప్లాంట్ కన్సల్టెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై చాలా మందికి అపోహలు ఉన్నాయన్నారు. ఇది రోగులకు గానీ, దాతలకు గాని ఎటువంటి సర్జరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. బ్లడ్ స్టెమ్ సెల్స్ దానం చేయడం ద్వారా దాతలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి తాగునీటి సరఫరా, ఇంజినీరింగ్ సెక్షన్లలో పనిచేస్తున్న సుమారు 1500 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ 5, 7, 8 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, లొడగల అప్పారావుకు శనివారం కార్మికులు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం రూ.13 జీతం ఇస్తున్నారని, దీంతో ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు కూడా అందడం లేదన్నారు. జివిఎంసిలో కాంట్రాక్టులకు గుత్తేదారులకు చెల్లిస్తున్న రేట్లను అవుట్ సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేసేలా కౌన్సిల్ తీర్మానం చేయాలని, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.25,140, సెమీస్కిల్డ్‌కు రూ.29,610 చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ చిన్నారావు, జాయింట్ సెక్రటరీ సతీష్, శ్రీను, వాసు, భాస్కర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గుడిలోవ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం: జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 23 నుంచి 27వ తేదీలలో మధ్యప్రదేశ్‌లో జరుగు జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు ప్రణయ్, జ్ఞానేంద్ర కుమార్, యశ్వంత్ నాయుడు, హేమంత్, శైలేష్ శర్మ జాతీయ స్థాయిలో సత్తా చాటాలని పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ అభిలషించారు.

బ్యాంకు ఖాతాదారులతో సమీక్ష

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలపై ఖాతాదారులతో విశాఖపట్నం రీజినల్ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది పనితీరు, ఖాతాదారులకు అవసరమైన సేవలపై ఖాతాదారులతో చర్చించారు. బ్యాంకులో త్వరతగతిన పనులు జరిగేలా సిడిఎం మిషన్, ఎసి సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. బ్యాంకు రుణాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎజిఎం రమేష్ సూచించారు. అనంతరం బ్యాంక్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జి.ప్రవీణ్, సౌమ్య, శైలు పాల్గొన్నారు.

వాసుపల్లి కొత్త డ్రామా : సాధిక్

ప్రజాశక్తి-సీతమ్మధార : టిడిపి, జనసేనలో చేరడానికి ప్రయత్నం చేసి విఫలం చెందిన వాసుపల్లి గణేష్‌కుమార్ కొత్త డ్రామా మొదలుపెట్టారని జనసేన కార్పొరేటర్ సాధిక్ ఆరోపించారు. రాజేంద్రనగర్ జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి పార్టీలలో చేరడానికి వాసుపల్లి గణేష్ ఎక్కని గుమ్మం లేదన్నారు. కూటమి పార్టీలో చేర్చుకోమని వాసుపల్లి గణేష్ ఫోన్‌లో టిడిపి, జనసేన నాయకులకు బతిమాలుకోడం వాస్తవమకాదా? ఈ విషయమై ప్రమాణం చెయ్యడానికి సిద్ధమా అని వాసుపల్లిని సాధిక్ ప్రశ్నించారు. ఫైరవీల లిస్ట్ బయట పెట్టమంటావా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ భిక్షతోనే 2014లో మొదటిసారి అసెంబ్లీలో వాసుపల్లి అడుగు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇసుకను అందుబాటులో ఉంచాలంటూ నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇసుక అందుబాటులో ఉంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు పలుచోట్ల శనివారం నిరసనలు తెలిపారు.

మధురవాడ : సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యాన మధురవాడ మార్కెట్ కూడలి సేవా రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భవన, ఇతర నిర్మాణ కార్మికులు పడుతున్న కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను పరిష్కారం చెయ్యాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. రెండు నెలలుగా ఇసుక ధరలు విపరీతంగా పెరగడంతో నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులకు పనులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే ఇసుక సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనులు లేకుండా పోయిన భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఉచిత ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, నాయకులు డి.అప్పలరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘాల అధ్యక్షులు ఎం.అప్పన్న, ఎ.లక్ష్మణ, డి.రవి, కె.రమణ, టి.రామకృష్ణ, ఎస్.భాస్కరరావు, బి.రమణ, అనంతరావు, బి.పాపారావు, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉచిత ఇసుక ఇవ్వాలని కోరుతూ సిఐటియు గాజువాక కమిటీ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట భవననిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక ధరలు పెరగడంతో ప్రజలు గృహాల నిర్మాణం చేపట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే బ్లాక్ మార్కెట్ ఇసుకను అరికట్టాలని డిమాండ్‌చేశారు. అనంతరం గాజువాక డిప్యూటీ తహశీల్దార్ త్రినాధ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిఐటియు నాయకులు లోకేశ్వరరావు, దాసరి అప్పారావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నాగేశ్వరరావు పార్థివ దేహంపై సిపిఎం జెండాను కప్పుతున్న జగ్గునాయుడు

నిస్వార్థ వ్యక్తి నాగేశ్వరరావు

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం నాయకులు పి.నాగేశ్వరరావు స్వార్థం లేని వ్యక్తి అని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీలో గుండెపోటుతో శుక్రవారం నాగేశ్వరరావు మృతిచెందారు. నాగేశ్వరరావు పార్థివ దేహంపై జగ్గునాయుడు పార్టీ జెండాను ఉంచి నివాళులర్పించారు. మౌనం పాటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నాగేశ్వరరావు జీవితాంతం కార్మికులు, పేదల సమస్యల పరిష్కారం కోసం పనిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకే కాకుండా, కొన్ని వందల మంది జీవితాలకు తీరని లోటన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా పేదల కోసం పనిచేశారని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరివరకు పార్టీలో కొనసాగారన్నారు.

సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఆరోగ్యం సహకరించకపోయినా పేదల సమస్యలపై పనిచేసేవారన్నారు. సిపిఎం నాయకులు బంగారు నాయుడు మాట్లాడుతూ, పివి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కొండలపై గుడిసెలు తొలగించాలని ఆదేశాలిస్తే ఒక్క గుడిసె కూడా తొలగించకుండా పోరాడిన వ్యక్తి నాగేశ్వరరావు అని కొనియాడారు. దిబ్బపాలెం కాలనీలో సెల్ టవర్ నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సిపిఎం నాయకులు కె.కిరీటం, ఎ.లోకేశ్వరరావు, ఎన్.రామారావు, ఐద్వా నాయకులు కె.వేణు, కె.సంతోషం, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రింటింగ్ యూనిట్ ఇన్చార్జి వై.సత్యనారాయణ, ఐద్వా నాయకులు ఎం.శ్రీదేవి, జి మణి పాల్గొన్నారు.

ఆయన కళ్లు సజీవం

నాగేశ్వరరావు రెండు కళ్లను ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు.

'సత్యనారాయణ అజాతశత్రువు'

ప్రజాశక్తి-సీతమ్మధార : సాయిరాం పార్లర్ అధినేత సత్యనారాయణ అజాత శత్రువు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో సత్యనారాయణ దశదినకర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, సత్యనారాయణ హోటల్ రంగంలో కొత్త ట్రెండ్ సృష్టించారన్నారు. అనేకమందికి ఉపాధి కల్పించడమే కాకుండా, దానాలు కూడా చేసేవారని తెలిపారు. సొంత పేరును ఇంటిపేరుగా మార్చుకున్న సత్యనారాయణ జీవితం ధన్యమన్నారు. రాబోయే కాలంలో హోటల్ అసోసియేషన్ చేపట్టబోయే అతి పెద్ద ప్రాజెక్టుకు సత్యనారాయణ పేరు పెట్టడానికి కృషి చేస్తామని హోటల్ అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పట్టాభి, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, చింతలపూడి వెంకటరామయ్య, తదితరులు విచ్చేసి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో తెలంగాణ హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఆల్ఫా కృష్ణ, పెర్ల సాంబమూర్తి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, మహమ్మద్ హుస్సేన్, విశాఖ హోటల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు వసంతకృష్ణ, అసోసియేషన్ సభ్యులు, సత్యనారాయణ కుటుంబ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఉక్కులో పూర్తి స్థాయి ఉత్పత్తికి సహకరించాలి

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తిని తీసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 1318వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ, గడిచిన ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ రూ.3450 కోట్లు జిఎస్‌టి, కమర్షియల్ టాక్స్, ఇన్ కమ్ టాక్స్ రూపంలో చెల్లించిందని గుర్తు చేశారు. పూర్తిస్థాయి ఉత్పత్తి చేస్తే రూ.5000 కోట్ల నుంచి రూ.పదివేల కోట్ల వరకు ప్రభుత్వాలకు ట్యాక్సులను చెల్లిస్తుందని తెలిపారు. నేటి స్టీల్ యాజమాన్యం మ్యాన్ పవర్‌ను తగ్గించే చర్యలు చేపడుతోందని, తద్వారా ప్లాంట్‌కు ఆర్థిక భారం తగ్గుతుందని ఆలోచించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. డిసెంబర్ నాటికి మూడు ఫర్నేసులు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం కోసం యాజమాన్యం, ప్రభుత్వాలు తగిన ప్రణాళికలతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు డిఎస్‌ఆర్‌సి మూర్తి, పట్టా రమేష్, శ్రీనివాస్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2 ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలిండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎపిబిసి సెల్ చైర్మన్ జాగరపు శ్రీను తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన పోస్టర్‌ను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీను, గోమెడ వాసు, విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షులు తోకాడ రాము, సూదికొండ రాజు, అజయ్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.

గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. అనంతరం వంద రోజుల పాలన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జోనల్ కమిషనర్ శేషాద్రి, కూటమి నాయకులు కోన తాతారావు, కరణంరెడ్డి నరసింగరావు, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి ఆదిత్యనగర్‌లో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అమలుచేసిన కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగోతి సూర్య ప్రకాష్, పోతిన అప్పారావు, పోతిన వెంకటరావు, అనిల్ రాజ్, భాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని చిన్నాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీగల శ్రీరామమూర్తి, మండల ప్రత్యేక అధికారి డి.సునీత, ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, తహశీల్దార్ ఆనంద్ కుమార్, టిడిపి నాయకులు కె.రమణ, కె.దామోదర, కె.లీలావతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు సంతపేటలో ప్రచార సభ నిర్వహించారు. సభకు హాజరైన వారికి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్నవాణి, కూటమి నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల రమేష్, డి వెంకటేష్, కొప్పల కృష్ణ, పరిమి భువనేశ్వరి, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి రాజీవ్ నగర్, కనకదుర్గానగర్, అంబేద్కర్ న్యూకాలనీ, ప్రశాంతి నగర్ కాలనీలలో కూటమి నాయకులు, వార్డు సచివాలయం – 2 సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, కొత్తల గోపాల్, దువ్వి తాతారావు, గోపిల్ల రామకృష్ణ, ఇళ్ల లక్ష్మి, నడిగట్ల పద్మ, రేపాక బసవ దేముళు, రాపర్తి గణపతి, రాగుల తిమోతి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : రైతులు, పేదల భూములను పరిరక్షించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని సంపతిపురం గ్రామంలో సర్పంచ నంబారు నాగమణి శ్రీను, ఎంపీటీసీ కడిమి గణేష్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు. జీవీఎంసీ 84వ వార్డుల సాలాపువానిపాలెం, సిరసపల్లి, కొత్తూరు నరసింగరావుపేట, కొండకొప్పాకలో కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలాపు మోహన్, సాలాపు రమణ, సిరసపల్లి రాజు, గవర సురేష్, పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, సరిపల్లి విష్ణు, గండ్రెడ్డి అప్పారావు, పిల్లా శ్రీను, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోట:వంద రోజుల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ కోటి గోవిందరావు, ఎంపీటీసీ పూడి దేవ తదితరులు తమ గ్రామానికి 30 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, కల్యాణ మండపం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరీ డైరెక్టర్ సత్యనారాయణ, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నీలవేణి, ఎంపీడీఓ వెంకన్నబాబు, తహశీల్దార్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

మతతత్వ, కార్పొరేట్ శక్తుల కలయికపై

సీతారాం ఏచూరి సైద్ధాంతిక పోరాటం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, వేదికపై అజశర్మ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశంలో మతతత్వం, కార్పొరేట్ శక్తుల కలయికపై సిపిఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రాజీలేని సైద్ధాంతిక పోరాటం చేశారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాపసభ శనివారం అనకాపల్లి గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో ఎస్ఎస్ఎస్.నారాయణ అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అజశర్మ మాట్లాడుతూ దేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని కోరుకుంటూ పార్లమెంటులో అనేక విధాలుగా పోరాటాలు జరిపారని గుర్తు చేశారు. 2004 నుంచి 2008 వరకు ప్రభుత్వ రంగం స్వర్ణయుగంగా ఉండటానికి సీతారాం ఏచూరి కారణమని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పార్లమెంట్లోనూ, బయటా ప్రజల తరఫున నిక్కచ్చిగా పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి అని తెలిపారు. పార్టీలు, భావాలకు సంబంధం లేకుండా అందరూ కలిసి ఆయనకు నివాళులర్పించడం జరుగుతుందని చెప్పారు. చివరి వరకు ఎర్రగుడ్డ కప్పుకొని ఆయన నమ్మిన ఆశయాలకు అనుగుణంగా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీనివాసరావు, కె.తేలయ్యబాబు, ఆర్.రమేష్, ఉషోదయ విద్యాసంస్థలు చైర్మన్ జె.రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ఆనందపురం: ఆనందపురం శ్రమజీవుల కాలనీలో ఆనందపురం శాఖ మహాసభ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నర్సింగరావు, ఐద్వా నాయకులు కె.నాగరాణి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షులు దొంతల రాము, ప్రమీల, నారాయణమ్మ, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

కరాటే పోటీల్లో శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పరవాడ

కెంకో షోటోకాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో మండలంలోని గొర్లివానిపాలెం శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబర్చి వివిధ విభాగాల్లో అనేక ప్రశంసలు, పతకాలు పొందారు. పాఠశాలకు చెందిన ఆర్ హర్షత కటాలో స్వర్ణం, కుమిటేలో స్వర్ణం, కె.మానస కటాలో స్వర్ణం, కుమిటేలో కాంస్యం, ఎ.చరణ్ కటాలో స్వర్ణం, ఎ.నవీన్ కటాలో కాంస్యం పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎస్ రంగారావు మాట్లాడుతూ కోచ్‌లుగా వ్యవహరించిన డాక్టర్ ఎవిరామారావు, లోహిత్‌ల అవిశ్రాంత కృషిని, అమూల్యమైన మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు. వారి అంకితభావమే విద్యార్థుల విజయానికి కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. పాఠశాలకు గర్వకారణంగా అత్యుత్తమ విజయాలు సాధించిన విజేతలందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 19 నుండి పాఠశాల విద్యార్థుల మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు విజయవంతమైనట్లు మండల కోఆర్డినేటర్ ఎస్‌వి నరసింహం తెలిపారు. అండర్ 14, అండ్ 17 బాల బాలికలకు ఈనెల 19న - ఖో ఖో, యోగ, చెస్ పోటీలు జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్లో నిర్వహించగా, 260 మంది హాజరయ్యారని తెలిపారు. 20న వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ (బాలికలు) జీవీఎంసీ మెయిన్ హైస్కూల్లో జరగ్గా 250 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 21న అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ (బాలురు) పోటీలు ఎన్‌టిఆర్ స్టేడియం నిర్వహించగా 140 మంది హాజరయ్యారని తెలిపారు. వీరందరికి క్రీడా ప్రాంగణ వసతి, భోజన వసతి కల్పించిన ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణకి, బ్రహ్మాజీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పై మూడు తేదీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు నియోజకవర్గ సాయి పోటీలో పాల్గొంటారని నరసింహం తెలిపారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అధిక వర్షాలతో 95 శాతం వరినాట్లు

మాట్లాడుతున్న ఆర్ఎఆర్ఎస్ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వర్షాలతో వరి నాట్లు ముమ్మరమయ్యాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ సిహెచ్.ముకుంద రావు తెలిపారు. జిల్లాలో సెప్టెంబర్ నెలలో 30శాతం అధిక వర్ష పాతం నమోదు కావడంతో 95 శాతం వరి విస్తీర్ణంలో నాట్లు పడ్డాయని పేర్కొన్నారు. స్థానిక ఆర్ఎఆర్ఎస్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు వరి సాగు ఆశాజనకంగా ఉందన్నారు. వ్యవసాయ అధికారి ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 24 మండలాల గాను 20 మండలంలో అధిక వర్షం నమోదైనదని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఇప్పటి వరకు వరి, చెరకు వంటి పంటలలో చీడ పీడలు గమనించలేదని తెలిపారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటలో రాబోయే 30 రోజులలో ఆకుముడత, కాండతొలుచు పురుగు దోమ పంట పురుగులు ఆశించవచ్చునని, తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని నివారించ వచ్చునని తెలిపారు. ముందు జాగ్రత్తగా క్లోరోపైరిఫోస్ 2 మిల్లి లీటర్ లేదా అసిఫాట్ 1.5 గ్రాములు లీటర నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పివికె.జగన్నాథ రావు, డాక్టర్ కేవీ.రమణమూర్తి, డాక్టర్ బి.భవాని, డాక్టర్ సిహెచ్ఎస్.రామలక్ష్మి, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్‌రావు, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశా దేవి, అనకాపల్లి, విశాఖ జిల్లా వ్యవసాయ అధికారులు అప్పలస్వామి, ఏడిఏలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పంట కోట అనంతర పద్ధతులు విభాగాన్ని సందర్శించి వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు.

ఎన్‌హెచ్ఆర్‌సి జిల్లా వైస్ చైర్మన్‌గా సుందరరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా దళిత, బడుగు, బలహీన వర్గాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కార్లి సాయి సుందరరావు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సి) అనకాపల్లి జిల్లా వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మండలంలోని వడ్రపాలెం గ్రామానికి చెందిన సాయి సుందరరావు పలు సంఘాలలో పనిచేసి, దళిత బహుజనులకు అనేక సేవల అందించారు. ఈ సేవలను గుర్తిస్తూ నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు అనకాపల్లి వైస్ చైర్మన్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. సాయి సుందరరావు నియామకం పట్ల దళిత సంఘాల నాయకులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నియామక పత్రం అందుకుంటున్న సుందరరావు

జంపపాలెం హైస్కూల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లా విద్యాధికారి వెంకటలక్ష్మమ్మ శనివారం ఆకిస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కూర్చొని మధ్యాహ్న భోజనం గురించి పలు ప్రశ్నలు అడిగారు. వారితో కింద కూర్చొని మధ్యాహ్న భోజనం రుచి చూశారు. స్వచ్ఛత సేవక్‌లో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసిన విధానం గురించి ప్రధానోపాధ్యాయులు ఎవిఎస్ శాస్త్రి వివరించారు. పాఠశాల రికార్డులు, మిడ్డేమీల్స్ పనితారు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇఒ సిబ్బంది వై.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, జి.నాగరాజు, ఎవిఎస్ సుబ్బారావు,కెఆర్ నాయుడు, సుధాకర్, శివ, శ్రీనివాసరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వివరాలు తెలుసుకుంటున్న డిఇఒ

రియల్ ఎస్టేట్ వ్యాపారి

డిఎస్ఎన్‌పై చర్యలు తీసుకోవాలి

మీడియా సమావేశంలో బాధితుల డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా వడ్డాది రియల్ ఎస్టేట్ వ్యాపారి దాడి సూర్య నాగేశ్వరరావు (డిఎస్ఎన్)పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు విలేకరుల ముందు లబోదిబోమన్నారు. శనివారం స్థానిక కార్మిక కర్షక భవనంతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు బాగల్ రాజేష్ కుమార్, దాడి సత్యవతి, దాడి అచ్చిబాబు, రాజేష్ మాట్లాడుతూ దాడి సూర్య నాగేశ్వరరావు చేసిన అక్రమాల ద్వారా తమలాంటి ఎంతోమంది బాధితులు ఆస్తులు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని, తమకు ఆత్మహత్యలు తప్ప మరో దారి లేదని పేర్కొన్నారు. తమకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికే అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియజేశామని చెప్పారు. అయితే దాడి సూర్యనాగేశ్వరరావు రంగులు మార్చిన ఊసరవెల్లిలా ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులను పట్టుకొని బాధితులను బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయకుంటే కలెక్టరేట్ ముందు మిగిలిన బాధితులతో కలిసి ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్ఎన్ బాధితులు

నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం, నాయకులు

మృతుని కుటుంబానికి షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలం రాజాం విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తూ మృతి చెందిన రొంగలి నర్సింగరావు కుటుంబానికే ఆ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. శనివారం కూడా రొంగళి నర్సింగరావు భార్య, కుటుంబీకులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా నర్సింగరావు భార్య రామలక్ష్మి మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ తన భర్త నర్సింగరావు మృతి చెందడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఉద్యోగాన్ని తమ కుటుంబీకులకు ఇస్తే ఉపాధి కలుగుతుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. భీమవరం మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి, నీలకంఠపురం మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాస్, సూరిబాబు పాపారావు, దేముడు బాబు, కవల సతీష్, బొడ్డు సత్తిబాబు, రాయి శ్రీను, చినభీమవరం, ఆర్ భీమవరం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టెక్కలి పరశురాం

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-మునగపాక : పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం అన్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం-2లో శనివారం జరిగిన పోషకాహార వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న కిట్లను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి శివ, సూరిశెట్టి అప్పలనాయుడు, కారుకొండ కాశి, అంగన్వాడీ టీచర్లు హేమ, ఉమా, సరస్వతి, మంగ తల్లి, రేవతి, శివ గణేష్ అమ్మ, లక్ష్మి, రాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- దేవరాపల్లి

మొక్కలు నాటి, పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలోని కొరుపోలు కల్లాలు వినాయక మండపం వద్ద నేచురల్ బాయ్స్ ఆధ్వర్యంలో అందజేసిన మొక్కలను శనివారం రైవాడ కాలువ గట్టుపై నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచి, జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి కృషి చేయాలని కోరారు. అనంతరం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, నేచురల్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎస్ఐ తదితరులు

సమాజ రుగ్మతలు రూపుమాపడానికి గురజాడ కృషి

కలెక్టర్ విజయ కృష్ణన్

గురజాడ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

సమాజంలో రుగ్మతలు రూపుమాపేందుకు ప్రముఖ కవి, రచయిత గురజాడ అప్పారావు ఎంతో కృషి చేశారని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె గురజాడ అప్పారావు వంటి మహానుభావుల రచనల ద్వారా సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. సమాజంలో వర్ణ వివక్ష రూపుమాపేందుకు గురజాడ అప్పారావు ఎన్నో రచనలు చేశారని, వాటిని ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు నాటకాలు, పాటల రూపంలో ప్రదర్శించేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ దయానిధి, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ మంజుల వాణి, డిపిఓ శిరీష, డిపిఇఆర్ఓ నాగలక్ష్మి, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

డైట్ కళాశాలలో...

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కవిత, సాహిత్యం, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని చెట్టుపల్లి పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు గోవిందు మాట్లాడుతూ, గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి మార్గదర్శకులని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాత బాబు, చుక్కపల్లి ఎంఎల్‌హెచ్‌పి కోమలి, సచివాలయం సెక్రటరీ పలాసి సరోజినీ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మహాకవి గురజాడ రచనలు సమాజానికి మేలుకొలుపు అని గురజాడ పౌండేషన్ అధ్యక్షులు కర్రి వెంకటేశ్వరరావు మాష్టారు కొనియాడారు. శనివారం ఉదయం గురజాడ జన్మస్థలమైన యస్.రాయవరం ప్రధాన కూడలిలో గురజాడ కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాయకరావుపేట ఇంఛార్జ్ కంబాల జోగులు, పౌండేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, గురజాడ రచించిన కన్యాశుల్కం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ కార్యదర్శి బొలిశెట్టి గోవిందరావు, యంపిపి కోన లోవలక్ష్మి, మాజీ సర్పంచ్ కందుల వేంకటేశ్వరరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, లక్కోజు ఆదిమూర్తి, ఉపాధ్యాయులు సత్యన్నారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో గురజాడకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకులు ఎల్.గౌరి, కె.వి సూర్యప్రభలు నివాళులర్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆనాడే పోరాడిన గొప్ప వ్యక్తి గురజాడ అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ, గురజాడ అప్పారావు ఆనాడు సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలకు, సనాతన భావాలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారన్నారు. ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో గురజాడ అప్పారావు చిత్ర పటానికి

భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో

డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిజిఎస్ నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఆర్.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన...

గాజువాక : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి తెలుగు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పి.అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.విజయప్రశాంతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు, లక్కీ అమర్ స్కూల్ కరస్పాండెంట్ వాసుదేవరావు, జనవిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ కన్వీనర్, గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యాభివృద్ధి కమిటీ ఎక్స్ అఫీషియో సభ్యులు డాక్టర్ పాలూరు లక్ష్మణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్వీకే పరశురామ్, ప్రధానోపాధ్యాయులు రాచకొండ శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు డి.వెంకటరావు, బి.ఢిల్లీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాజువాకలో నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు

పిడుగు పడి రెండు పాడి గేదెలు మృతి

భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని చింతలపాలెం గ్రామంలో పిడుగు పడి రెండు పాడి గేదెలు మృత్యువాత పడగా, పాడి రైతులైన భార్యాభర్తలు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... చింతలపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు బుదిరెడ్డి దుర్గనాయుడు, జయమ్మ శనివారం సాయంత్రం తమ కల్లాలు ఉన్న నర్సింగబిల్లి వెళ్లారు. వర్షం కురువడంతో పాకలోకి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పాకపై పడ్డంతో భార్యాభర్తలు దుర్గనాయుడు, జయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న రెండు గేదెలు పిడుగు పాటుకు అక్కడికక్కడ మృతి చెందాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

మృతి చెందిన గేదె

శ్మశానవాటికలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామ శ్మశాన వాటికలో పేరుకుపోయిన తుప్పలను శనివారం జెసిబితో తొలగించి చదును చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది మహేష్, గ్రామ ఉప సర్పంచ్ బల్ల అప్పలకొండ, టిడిపి కూటమి నాయకులు ఆనాల తాతయ్యానాయుడు, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, కాపిశెట్టి శివ, తెరపల్లి శ్రీను, కోన సత్తిబాబు, జగతా మాలినాయుడు, తిర్రి నాగేష్, సియాద్రి చిట్టిబాబు, మజ్జి బాలాజీ, పూడి మణికంఠ, సేనాపతి శివ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, ఫెస్ట్ కంట్రోల్, సూపర్ వైజర్ కార్మికులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై దశల వారీగా ఆందోళన చేసినా ఫలితం లేక పోవడంతో గత్యంతరం లేక ఈ నెల 30 నుంచి సమ్మె చేయనున్నట్టు చెప్పారు. ఎన్నో రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరించడం తగదన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.సంతోష్, నూకరాజు, వెంకట లక్ష్మి, అడ్డా ప్రసాద్, సుదీర్, సూరిబాబు, లోవరాజు ,లక్ష్మి,జగన్నాథం, అడవి రాజు, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

హౌసింగ్ పట్టాను చూపుతున్న బాధితురాలు దుర్గ

గృహ నిర్మాణ పేమెంట్ వేరొకరికి జమ

- బాధితురాలి ఆవేదన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:గృహ నిర్మాణ రెండో పేమెంట్‌ను చెల్లించాలని మండలంలోని ఓ లబ్ధిదారురాలు కోరింది. బాధితురాలి కథనం మేరకు మండలంలోని లింగరాజుపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళ కశింకోట దుర్గ (భర్త నాగు)కు గత ప్రభుత్వం గృహం మంజూరు చేసింది. గ్రామంలోని సర్వే నెంబరు 237 లో ప్లాట్ నెంబరు 59గా కేటాయించింది. ఇంటి నిర్మాణం చేపట్టినపుడు ప్రభుత్వం నలభై వేల నగదు, మూడు ట్రాక్టర్ల ఇసుక, ఇనుము, నలభై బస్తాలు, ఇనుప గుమ్మాలు, కిటికీలు ఇచ్చారని కశింకోట దుర్గ తెలిపింది. తరువాత తనకు రావలసిన మొత్తాన్ని అదే గ్రామానికి చెందిన తనపేరునే ఉన్న మరొక మహిళ కశింకోట దుర్గ భర్త శంకర్ అనే మహిళకు కమీషన్ల కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్ వేయించారన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళిన ఫలితం శూన్యమన్నారు. ఇల్లు మంజూరు కాని మహిళకు పేమెంట్ చేయడం పట్ల స్థానిక విలేఖరులకు తన గోడు వెళ్ళడించుకుంది. అధికారులు తక్షణం స్పందించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ పై విచారణ జరిపి తగు న్యాయం చేయవలసిందిగా బాధితురాలు దుర్గ కోరింది.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

నరసయ్యపేట విద్యార్థుల సత్తా

పలు రకాల పోటీల్లో ప్రతిభ- పలువురు ప్రశంసలు

ప్రజాశక్తి - మాడుగుల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాఠశాలల మధ్య నిర్వహించిన పోటీలలో నరసన్నపేట సంక్షేమ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. ఈనెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాఠశాల విద్యార్థుల మధ్య వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నరసన్నపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వాలీబాల్ అండర్ 17 సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని, వాలీబాల్ జూనియర్స్ అండర్ 14 విభాగంలో ప్రథమ బహుమతిని, షాట్ పుట్ లో ప్రథమ బహుమతుల్ని గెలుచుకున్నారు.. విద్యార్థులలో క్రీడా ప్రతిభను నింపి విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుని, విద్యార్థులను ఎస్ఎంసి చైర్మన్ ఎస్ అప్పారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని నాగ శిరీష అభినందించినట్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుడు బావ రాజు అప్పారావు పేర్కొన్నారు.

భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పలు రెవెన్యూ పరిధిలో ఉన్న ఫ్రీ హోల్డ్ భూములను గత రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పరిశీలిస్తున్నారు. కోటవురట్ల మండలం తహశీల్దార్ జానకి, పాయకరావుపేట ఆర్ఎస్ డిటిలు రాజేంద్రప్రసాద్, ఎం.నానిలు సచివాలయ సర్వేయర్లు వీఆర్వోలతో మూడు బృందాలు ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారు. కోటవురట్ల తహశీల్దార్ జానకి ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ, మండలంలో 258 లబ్ధిదారులకు చెందిన సుమారు 354 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. పరిశీలన పూర్తయిందని ఉన్నతాధికారులకు అందించడానికి నివేదికలు తయారు చేస్తున్నామని ఆమె తెలిపారు.

కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూముల విచారణను మండలంలో రెండో రోజు కూడా రెవెన్యూ అధికారులు కొనసాగించారు. నాతవరం తహసిల్దారు వాసు, నర్సీపట్నం తహసిల్దారు రవికుమార్ విచారణలో పాల్గొని రైతుల అభిప్రాయాలను, వారి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం పట్టాలు జారీ చేసిన సాగులో ఉన్నారా లేక ఎవరైనా అనుభవిస్తున్నారా అన్న విషయాలతో పాటు విస్తీర్ణం, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కూడా రికార్డుల పరిశీలన జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఎస్ఐలకు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నర్సీపట్నం రూరల్ ఎస్సై రాజారావు, కోటవురట్ల ఎస్సైను రమేష్‌ను రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావుతో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలుతెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షులు ఎన్నం రమణ, జనసేన పార్టీ రూరల్ ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, రెల్లి సంఘం మాకవరపాలెం మండల నాయకులు వడ్డాది దేవుడు, కోటి కుమార్ పాల్గొన్నారు.

మట్టిలో కూరుకుపోయిన ట్రాక్టర్

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు అధికారులు ప్రధాన రహదారి వద్ద రోడ్డు తవ్వి పైపులు వేసి మట్టి వేసి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన మట్టి రోలింగ్, వాటరింగ్ చేయకపోవడంతో వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.రాత్రి సమయంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చేసుకుంటున్నాయి. తారు రోడ్డును కాస్త మట్టి రోడ్డుగా మార్చేయడంతో వర్షం పడినప్పుడు బురదగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవా'

కోటవురట్లలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. తహసిల్దారు, మండల పరిషత్ కార్యాలయాల వద్ద సిబ్బంది ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు.బోడపాలెం గ్రామానికి వెళ్లే రహదారి వద్ద ఇరువైపులా తుప్పలను గ్రామ సర్పంచ్ ఎరుకునాయుడు, పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ, కార్యదర్శి స్వామినాయుడు ఆధ్వర్యంలో తొలగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఈఓ రామారావు పాల్గొని పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆవరణలో శుభ్రం చేశారు. బికేపల్లి సచివాలయం హెల్త్ సెంటర్ వద్ద సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో జయరాం పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుభ్రం చేస్తూ ప్రారంభించారు. చీపురు పట్టుకొని కార్యాలయ గోడలను, గదులను శుభ్రం చేశారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత, సచివాలయ కార్యదర్శి కె.రాజేష్ ఆద్వర్యంలో పంచాయతీ కార్యాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ భూలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ తమ్మినాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వర్ణ, ఎఎఎన్ఎం లావణ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేడిపేట గ్రామంలో స్వచ్ఛత సేవక్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎస్‌వి.శ్రీనివాస్, ఎం.సద్గుణ, సాద్విక పాల్గొన్నారు.

చీడికాడ:స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అఫీషియల్ పర్సన్ ఇన్చార్జి కె.రమారత్నం, సీఈవో వరహాలదొర, సిబ్బంది వరహాలమ్మ, నాయుడు, మహాలక్ష్మి నాయుడు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలంలోని పలు పాఠశాల లో స్వచ్ఛతా హీ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలను శుభ్రం చేసారు. కొత్తకోట మెయిన్ స్కూల్లో ఎంఈ వో బ్రాహ్మజీ, చిలకవానిపాలెం పాఠశాలలో సిఆర్ఎం టి.రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు చెత్తను తొలగించారు.

అనకాపల్లి:స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి కలెక్టర్ కార్యాలయ పరిసరాల్లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.దయానిధి, సిపిఓ రామారావు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ మంజుల వాణి, డిపిఓ శిరీష, పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ ఎం దీపిక ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హీ సేవ - 2024 కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, డీఎస్పీలు పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, వినోద్ బాబు, సతీష్, ఎస్సై ఆదినారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చోడవరం పంచాయతీ పరిధిలో పలుచోట్ల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో నారాయణరావు మాట్లాడుతూ, చోడవరం పట్టణంలోని మురికివాడలో డ్రైనేజీ, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించనున్నట్లు చెప్పారు. సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు:స్వచ్ఛత హి సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని చౌడివాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పిలుపునిచ్చారు. శనివారం చౌడువాడ గ్రామంలో డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, కార్యదర్శి ఎన్ రామునాయుడు, ఏపీవో వరలక్ష్మి, వార్డు మెంబర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు ఆధ్వర్యంలో తుప్పల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

చోడవరంలో..

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి జోన్ 4 పరిధి 34వ వార్డు కొబ్బరితోటలో శనివారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ చేపట్టారు. పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసుపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో బీచ్‌లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ జాతీయ సేవా పథకం యూనిట్ 2, రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేరు, లెట్స్ డు ఇట్ ఇండియా విశాఖపట్నం సంయుక్తంగా ప్రపంచ శుభ్రత దినోత్సవాన్ని విశాఖపట్నం బీచ్ రోడ్‌లో నిర్వహించాయి. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ కోస్టల్ క్లీనింగ్ డే - 2024 సందర్భంగా విశాఖలోని ఆర్కే బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ఇండియన్ కోస్ట్ గార్డ్ శుభ్రతా పనులు చేపట్టింది. 1600 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఆర్కే బీచ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ హాజరయ్యారు. రుషికొండ బీచ్‌లో జరిగిన కార్యక్రమానికి టిఎం ఎడిజి (రిటైర్డ్) డాక్టర్ విఎస్ఆర్.మూర్తి పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ అధ్వర్యాన శనివారం సంస్థ ఆవరణలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేందర్ రావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్.కోటేశ్వరరావు, రామకృష్ణ, సీనియర్ మేనేజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గొలుగొండ మండలం కె.ఎల్లవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారన్నారు. ఎల్లవరం పంచాయతీలో పూర్తి స్థాయి సిమెంట్ లైనింగ్‌తో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి 2.7కోట్లు మంజూరు చేశామన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ కార్యక్రమం చేపట్టాలన్నా కొంత సమయం పడుతుందని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకెళ్లి ఖజానా ఖాళీగా అప్పజెప్పిందని ఆయన విమర్శించారు. 16,437 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు. పెన్షన్లు పెంచి, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఒక్క రోజులోనే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నర్సీపట్నం ఆస్పత్రికి వచ్చే రోగులకు తక్కువ ధరలో భోజనం అందించేందుకు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, వ్యవసాయశాఖ ఏడీ మోహన్‌రావు, డిఎల్‌డిఒ ఉదయశ్రీ, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఉద్యానవనశాఖ అధికారి విరిష, వెలుగు నర్సీపట్నం క్లస్టర్ ఏసీ సత్యనారాయ, అన్ని శాఖల అధికారులు, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, కె.ఎల్లవరం సర్పంచ్ రాంబాబు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన మౌనిక

బాక్సింగ్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గౌహతిలో జరిగిన సీనియర్, యూత్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్లో పాల్గొన్న స్థానిక క్రీడాకారిణి బొంతు మౌనిక బంగారు పతకం సాధించిందని స్థానిక శాప్ కోచ్ అబ్బు, నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేశారు. బాక్సింగ్ ఫైనల్ పోటీలో పంజాబ్ మహిళా బాక్సర్‌తో తలపడి 80 కేజీల కేటగిరిలో బంగారు పతకం సాధించిందని తెలిపారు. క్రీడా అభిమానులు, కుటుంబ సభ్యులు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ సెక్రటరీ వీ లక్ష్మణ్ దేవ్ క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అల్లూరి పేరు పెట్టడంపై హర్షం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:గడచిన ఎన్నికలలో భాగంగా కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడంపై వెనుకబడిన తరగతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే శివ నారాయణ రాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలను తెలిపారు.చిన్న వయసులోనే ప్రాణాలను అర్పించిన విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు అని, అటువంటి మహనీయుడి పేరు భోగాపురం ఎయిర్‌పోర్టుకి పెట్టడం ఎంతో ఆనందదాయ కమన్నారు.

జూడో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలో గబ్బాడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెట్ల చంద్రమౌళి రాష్ట్రస్థాయి జూడో పోటీకి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అండర్-17 విభాగంలో ఈనెల 22 నుంచి 24 వరకు తిరుపతిలో జరిగే పోటీల్లో చంద్రమౌళి పాల్గొంటారని వివరించారు. ఈ పోటీల్లో విజయం సాధించి గ్రామానికి మంచి పేరు తేవాలని ఉపాధ్యాయులు, స్నేహితులు ఆకాంక్షించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొత్త ఎల్లవరం గ్రామంలో పొలం పిలుస్తుంది పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ఎన్డీఏ కూటమి ప్రయత్నిస్తుందన్నారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి మోహన్ రావు, మండల వ్యవసాయాధికారి సుధారాణి, ఆర్డీవో జయరాం, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరచంద్ర, మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ కొల్లు రాంబాబు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు 'ప్రజాశక్తి' విరాళాల సేకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి

విజయవాడ వరద బాధితుల కోసం అనకాపల్లి పట్టణంలో ప్రజాశక్తి డివిజన్ విలేకరులు శనివారం విరాళాలు సేకరించారు. ప్రజలు ఉదారంగా రూ.12,412 విరాళ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ద్వారకానగర్, గురుద్వారా ప్రాంతాల్లో ప్రజాశక్తి సిబ్బందికి రూ.5070ను ప్రజలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు ఎన్.మధు, జి.కాంతారావు, ఎస్.రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉక్కునగరం : కూర్మన్నపాలెం, ముస్తాఫా జంక్షన్, వడ్లపూడి సంత ప్రాంతాల్లో ప్రజాశక్తి సిబ్బందికి రూ.9814 విరాళ మొత్తాన్ని ప్రజలు అందించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం. వెంకటేశ్వరరావు, వై.సత్యనారాయణ, ఆర్‌కె.నాయుడు , తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

తాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి -కొత్తకోట:సుమారు ఆరు నెలలుగా తాగునిటీ కుళాయిలు నుంచి చెడు వాసన తో పాటు చెత్త, వ్యర్థాలు వస్తున్నాయని పంచాయతీ పాలకులకు, అధికారులకు చెప్పినా పట్టిం చుకోలేదని కొత్తకోట గ్రామ మిలటరీ నగర్ మహిళలు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద చోడవరం ఎమ్మెల్యే రాజు, ఎంపీడీఓ వెంకన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. కాలనీ లో గతంలో తాగునీరు బాగానే వచ్చేదని, ఇటీవల ఇంటియింటి కొళాయిలు వేసిన దగ్గర నుంచి ఈ ఇబ్బం దులు వస్తున్నాయని కాలనీ మహిళలు ఎం.లక్ష్మి, కోట ఈశ్వరమ్మ, రాజు తదితరులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజు సమస్య ను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకన్న బాబును ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీఓ కాలనీ లో పర్యటించి సమస్య పై ఆరా తీశారు. రెండు రోజులలో పరిస్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల కేంద్రం లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిం చారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, తెలుగుదేశం సీనియర్ నాయకుడు పుప్పల అప్పలరాజు, టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాజాతాలపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, నేచర్ స్వచ్ఛంద సంస్థతో కలిసి సాంత్వన పరిష్కారాలు పేరుతో కళాజాత ప్రదర్శనకు ప్రణాళిక రూపొందించారు. శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ డైరెక్టర్ ఎస్. వికాస్ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు తల్లీ కూతుళ్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రోలుగుంట మండలానికి చెందిన పీవీఎం నాగజ్యోతి కుమార్తె సాహితి ఇంటర్నేషనల్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. శనివారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద విలేకరులతో నాగజ్యోతి మాట్లాడుతూ, రోలుగుంట మండలంలో ఇంగ్లీష్ టీచర్ గా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నానని చిన్నప్పటి నుండి అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్ ఆటలు ఆడటం ఎంతో ఇష్టమన్నారు. నేషనల్ లెవెల్‌లో పవర్ లిఫ్టింగ్‌లో ఎన్నో పతకాలు సాధించారని తెలిపారు. తన కుమార్తె సాహితి నేషనల్, స్టేట్ లెవెల్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిందని, తామిద్దరంఈనెల 22వ తేదీ నుండి 30 వరకు సింగపూర్, మలేషియాలో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటామని తెలిపారు.

పోటీలకు ఎంపికైన తల్లీ కూతురు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		